بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ   نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ   وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

Summary of Friday Sermon Hadhrat Khalifatul Masih V 29.9.2017 (TELUGU)

అల్లాహ్ తఆలా ధర్మమును స్థాపించుటకు, దానిని ఆచరించుటకు, ఆచరింపజేయుటకు తమ వంతు కృషి చేసినప్పడే అన్సారుల్లాహ్ వాస్తవముగా అన్సారుల్లాహ్ అనబడుదురు.

హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 22.9.2017 తేదీన మస్జిద్ బైతుల్ ఫుతూహ్, మోర్డన్ లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము

తషహ్హుద్, తఅవ్వుజ్, తస్మియ, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లనిరి.

అల్లాహ్ తఆలా కృపానుసారము నేడు మజ్లిస్ అన్సారుల్లాహ్ ఇంగ్లాండ్ వార్షిక ఇజ్తిమా ప్రారంభమగుచున్నది. కనుక ఈ సందర్భమున నేనొక ముఖ్యమైన ప్రాథమిక విషయము అనగా నమాజ్ గురించి సూచించదలచితిని. ప్రతి విశ్వాసిపై నమాజ్ విధిగావించబడెను. కాని 40 సంవత్సరముల తరువాత నా వయసు పెరుగుచున్న ప్రతి రోజు నా జీవితములోని ఒక్కొక్క రోజు తగ్గుచున్నందున అల్లాహ్ తఆలా ప్రార్థనలు, నమాజ్ వైపు మరింత శ్రద్ధ కలుగవలెనను భావన మరింత పెరగవలెను. నేను అల్లాహ్ తఆలా ఆస్థానములో హాజరగు రోజు వేగంగా వచ్చుచున్నది. అక్కడ మన ప్రతి కర్మ గణించబడును. మరణము తర్వాతి జీవితము, ప్రళయ దినముపై నమ్మకము గల ప్రతి వ్యక్తి మేము అల్లాహ్ తఆలా హక్కులు చెల్లించాలి, అతని దాసుల హక్కుల కూడ చెల్లించాలని చింతించవలెను. తమ వంతు కృషి చేయుచు అల్లాహ్ తఆలా హక్కులు చెల్లించుచు అల్లాహ్ తఆలా ఆస్థానములో హాజరు కావలెను. నమాజ్ చదవాలని అల్లాహ్ తఆలా సూచించిన ప్రతి సారి క్రమం తప్పకుండా, నిర్ణీత సమయములో, సామూహికంగా చదవాలని కూడ సూచించెను. నమాజ్‌ను నిలబెట్టాలను ఆదేశము గలదు. నమాజ్‌ను నిలబెట్టుట అనగా నమాజ్‌ను నిర్ణీత సమయములో సామూహికంగా సలుపుటయే అగును. కాని అనుభవమైనదేమనగా, అన్సారుల్లాహ్ వారు కూడ తమ నివేదికలను పరిశీలిస్తారు కావచ్చును, పరిశీలించవలెను. పరిపక్వత, అనుభవ దశకు చేరిన అన్సార్ కూడ సామూహిక నమాజ్ పట్ల ఆశించిన మేరకు శ్రద్ధ చూపడం లేదు. తమ ప్రతి సభ్యుడు నమాజ్‌కు అలవాటు పడే విధముగా అన్సారుల్లాహ్ ప్రత్యేక శ్రద్ధ చూపవలెను. తాను సామూహిక నమాజ్‌కు అలవాటు పడే విధముగా ప్రతి నాసిర్ ఆత్మ పరిశీలన చేసుకుంటూ ప్రయత్నించవలెను. అనారోగ్యము లేదా మరో అనివార్య పరిస్థితి తప్ప సామూహిక నమాజ్ సలుపుటకు శక్తిమేర ప్రయత్నించవలెను. మస్జిద్ గాని నమాజ్ కేంద్రము గాని సమీపములో లేనిచో ఆ ప్రాంతపు కొందరు వ్యక్తులు గుమికూడి ఎవరో ఒకరి గృహములో సామూహిక నమాజ్ సలుపగలరు. ఈ సౌకర్యము కూడ లేనిచో ఇంటి సభ్యులు కలిసి సామూహిక నమాజ్ చదవవచ్చును. తద్వారా పిల్లలకు, నవయువకులకు నమాజ్, సామూహిక నమాజ్ ప్రాముఖ్యత తెలియును.

అల్లాహ్ తఆలా ధర్మమును స్థాపించుటకు, దానిని ఆచరించుటకు, ఆచరింపజేయుటకు తమ వంతు కృషి చేసినప్పుడే అన్సారుల్లాహ్ వాస్తవముగా అన్సారుల్లాహ్ అనబడుదురు. మానవ జన్మ ఉద్దేశమైన దైవారాధనను పాటించనిచో, తమను పర్యవేక్షకులుగా చేయబడిన వారితో చేయించనిచో లేదా అమలు చేయించుటకు ప్రయత్నించనిచో, తమ ఉదాహరణను చూపించనిచో కేవలము నామమాత్రముగా అన్సారుల్లాహ్‌గా మిగులుతారు.

నేడు ఖడ్గములు, బాణములతో యుద్ధము జరగడం లేదు. కనుక సహాయకుల అవసరం లేదు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లనిరి. మన విజయ ఆయుధము దుఆయే. అన్సారుల్లాహ్ అగుటకు దుఆ అను ఈ ఆయుధమును వినియోగించవలసిన అవసరమున్నది. ఇందుకు అల్లాహ్ తఆలా సూచించిన పద్ధతి ప్రకారము ఈ ఆయుధమును వినియోగించవలసిన అవసరమున్నది. ఇలా సంభవించినప్పుడే మనము హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం బైఅత్ చేసిన హక్కును చెల్లించగలము. నా మాటలను వననిచో, తమలో పవిత్ర మార్పులు కల్పించుకోనిచో, ప్రార్థనల హక్కు చెల్లించదలచనిచో నా బైఅత్ చేయుట నిరుపయోగమగునని వారు పదే పదే సూచించిరి. కనుక తాము ఎంత వరకు నమాజ్‌ను పాటించుచున్నారో, తమ ఉదాహరణను పిల్లలకు చూపుచున్నారో, వారి నమాజుల దశ, స్థితి ఎట్లున్నదో ప్రతి నాసిర్ ప్రత్యేకంగా ఆత్మ పరిశీలన చేసుకోవలెను. విధి లేదా భారముగా భావించి నమాజులు సలుపుచున్నారా? లేదా వాస్తవముగా అల్లాహ్ తఆలా ప్రీతిని పొందుటకు మనమిదంతా చేయుచున్నామా ? నమాజ్ ప్రాధాన్యత, దాని అనివార్యత, దాని ఉపయోగము, దానిని సలుపు పద్ధతి, దాని ఉద్దేశము, దాని తత్వము, దాని సమయముల జ్ఞానము అనగా వివిధ అంశములను విభిన్న పద్ధతులలో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం పదే పదే వివిధ సందర్భములలో వివిధ చోట్ల వివరించిరి. వారి పలు ఉపదేశములను నేనిప్పుడు ప్రస్తావింతును. అవి దాని ప్రాముఖ్యత, వివేకమును తెలుపును. క్రమం తప్పకుండా వరుసగా నమాజులు చదువుట గురించి ఉపదేశించుచు ఒక చోట ఒక సమావేశములో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లనిరి.

క్రమం తప్పకుండా నమాజులు సలుపగలరు. కొందరు ఒక్క నమాజ్ మాత్రమే చదువుతారు. నమాజ్ క్షమించబడదని, తుదకు సందేశహరులకు కూడ క్షమించబడలేదని వారు గుర్తుంచుకోవలెను. ఒక హదీసులో ఇట్లు గలదు. హజ్రత్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు ఒక క్రొత్త సంఘము వచ్చి, నమాజ్ క్షమించాలని కోరెను. ఆచరణ లేని ధర్మము శూన్యమని వారు సల్లల్లాహు అలైహి వసల్లం అనిరి. కనుక మీరీ విషయమును గట్టిగా గుర్తుంచుకోగలరు. అల్లాహ్ తఆలా ఆదేశముల మేరకు నడుచుకోగలరు.

అల్లాహ్ తఆలా ఇట్లనెను. అల్లాహ్ తఆలా సంకేతములలో ఒక సంకేతమేమనగా భూమ్యాకాశములు అతని ఆజ్ఞతో కొనసాగుచున్నవి. అల్లాహ్ తఆలా ఇష్టముతో మాత్రమే భూమ్యాకాశములు కొనసాగగలవు. ప్రకృతి పరమైన ధర్మము అనుసరించదగినదని స్వభావముల వైపు ఆకర్షితులయ్యే వ్యక్తులు కొందరందురు. ఆరోగ్య రక్షణ సూత్రములను పాటించనిచో దైతిభీతి, పవిత్రతతో లాభమేమిటి ?

నమాజ్ ప్రాముఖ్యత, దాని అవసరము, నమాజ్ పరిస్థితి అను విషయములను విరించుచు ఒక సందర్భమున హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. నమాజ్ ఏమిటి ? ఒక ప్రత్యేక దుఆ. కాని ప్రజలు దీనిని రాజుల ట్యాక్స్‌గా భావించుచున్నారు. దేవునికి అ విషయముల అవసరమేమిటని అవివేక ప్రజలు తెలుసుకోవడం లేదు. మానవుడు దుఆ, స్మరణ చేయుటతో ఆ సర్వశక్తిమంతుడైన దేవునికి అసవరమేమిటి ? ఇందులో మానవునికే లాభము గలదు. ఈ పద్ధతిన అతడు ఉద్దేశమును పొందును. ప్రార్థనలు, దైవభీతి, ధార్మికత వైపు ప్రజలకు శ్రద్ధ లేనిది చూచి నాకు చాలా బాధ కలుగును. ప్రార్థనలో కలుగవలసిన ఆనందము కలుగడం లేదు. దేవుడు ప్రతి వస్తువులో ఒక ప్రత్యేక ఆనందము పెట్టెను. మానవున్ని అల్లాహ్ తఆలా ప్రార్థన కొరకు పుట్టించెను. అయినను ఈ ప్రార్థనలో అతనికి ఎందుకు ఆనందము కలుగడం లేదు. మానవుడు ప్రార్థన కొరకే పుట్టించబడినప్పుడు ప్రార్థనలో

అతనికి గొప్ప ఆనందము కలుగుట చాలా ముఖ్యము. అటులైనచో అల్లాహ్ తఆలా ఎలాంటి ఉద్దేశము లేకుండానే వృథాగా పుట్టించినాడా. ఆనందము మధురముగా లేనిచో మానవుడు దానిని ఎలా చేయును. ఉదా॥ ఆహారము, అన్నపానీయాలు మానవుని కొరకు పుట్టించబడెను. వాటిలో అతడు ఒక ఆనందము మధురమును పొందడం లేదా? ఈ రుచికి, భావించుటకు అతని నోట్లో నాలుక లేదా. ప్రార్థన కూడ భారము లేదా ట్యాక్స్ కాదని గట్టిగా గుర్తుంచుకొనుము. ఇందులో ఒక ఆనందము, మధురము గలదు. అది ప్రపంచ ఆనందముల కంటే గొప్పది. ఒక రోగి అత్యత రచుకిరమైన ఆహార రుచిని గ్రమిచంలేడో అలాగే దురదృష్టవంతుడైన మానవుడు ప్రార్థనలతో రుచిని పొందలేడు. మనలో ఈ స్థితిలో యున్నవారు చింతించవలెను. నిజమైన నమాజ్ ఎలా యుండవలెనో తెలుపుచు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. నమాజ్‌తో ఇహ పరలోకము రెండు బాగుపడును. నమాజ్ చదివే చాలా మందిని అది శపించును. అందుకే అల్లాహ్ తఆలా ఇట్లనెను. ఫవైలుల్లిల్ ముసల్లీన్ అల్లజీన హుమ్ అన్ సలాతిహిమ్ సాహూన్ అనగా “కనుక ఆ ప్రార్థన సలుపు వారు నాశనమగుగాక! ఎవరైతే తన ప్రార్థన నమాజ్ నుండి ఏమారి వుందురో”. నమాజ్ చదవడంతో మానవుడు అన్ని రకాల దుష్కార్యములు, దుర్లజ్జతల నుండి రక్షించబడును.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఈ విధముగా నమాజ్ చదువుట మానవుని చేతిలో లేదు. ఈ పద్ధతి దేవుని సహాయము లేనిదే సాధ్యము కాదు. దుఆలలో నిమగ్నము కానంత వరకు ఇటువంటి దుఃఖకర స్థితి ఏర్పడదు. కనుక నమాజ్ అనందము, సంతోషము పొందుటకు అల్లాహ్ తఆలా శుభమును పొందుట అనివార్యము. అల్లాహ్ తఆలా శుభమును యాచించుటకు అతని ముందే మోకరిల్లు అవసరము గలదు. క్షణ క్షణం అతన్నే స్మరించు అవసరము గలదు. దుఃఖకర స్థితి అతనితోనే యాచించవలెను. ఈ స్థితి మానవుడు కల్పించుకొన్నచో నమాజులలో ఆనందము ఏర్పడును.

ఇన్నల్ హసనాతి యుజ్‌హిబ్నస్సయ్యిఆతి అనగా సత్కార్యములు లేదా నమాజ్ దుష్కర్యముల నుండి రక్షించునని తెలిపెను. నమాజ్ దుష్కర్మలు, పాపముల నుండి రక్షించునని మరో చోట తెలిపెను. కొందరు నమాజులు చదువుతారు కాని పాపములకు పాల్పడుచున్నట్లు మనము చూస్తున్నాము. దీనికి సమాధానమేమనగా వారు సంపూర్ణ శ్రద్ధ, వినమ్రతతో నమాజ్ చుదువరు. ఆచారము అలవాటుగా మాత్రమే వారు నమాజ్ చదువుతారు. వారి ఆత్మ మరణించినది. సత్యమైన స్ఫూర్తితో చదివిన నమాజ్ దుష్టత్వముల నుండి నివారించును.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. నమాజ్ భాగములు అనగా నిలబడుట, మోకరిల్లుట, సాష్టాంగము చేయుట, కూర్చొనుట వంటి స్థితులన్ని ఈ ఉద్దేశము, ఈ స్ఫూర్తిని పొందుటకే పెట్టబడినవి. వారిట్లనిరి. నమాజ్ భాగములు వాస్తవానికి ఆధ్యాత్మిక ఆసనాలు. మానవుడు దేవుని ఎదుట నిలబడవలసి వచ్చును. నిలబడుట కూడ మర్యాదలో భాగమే. మోకరిల్లుట అనేది రెండవ స్థితి. ఇది సన్నద్ధత అనబడును. అనగా ఆదేశము విని మెడలు వంచుకొని ఎంతగా మోకరిల్లెను. సాష్టాంగము సంపూర్ణ మర్యాదలలో భాగమే. సంపూర్ణ గౌరవముతో దేవుని ముందు హాజరగుటయే అగును. గుర్తు చేయించుటకు అల్లాహ్ తఆలా ఈ పద్ధతులను నియమించెను. శరీరమునకు అంతరంగికముగా భాగ్యము కలిగించుటకు వీటిని నియమించెను. కేవలం నకలు చేయుచు బాహ్యముగా చేతులు కట్టుకొని, మోకరిల్లినచో, సాష్టాంగములు చేసినచో, కూర్చున్నచో, ఆసనాలు చేసినచో నకలు చేసినట్లే అగును. ఒక భారముగా భావించి ముగించదలచినచో దీనితో ఎలాంటి ఆనందము, మధురత్వము లభించునో మీరే చెప్పగలరు. ఆనందము లభించనంత వరకు దీని వాస్తవికత ఎలా తెలియును ? ప్రార్థన, దాసత్వము, దైవత్వము మధ్య ఒక ప్రత్యేక సంబంధము ఏర్పడినప్పుడే నమాజ్‌లో ఒక ఆనందము కలుగును. దేవుని వైభవమునకు తగినట్లుగా తనను తాను శూన్యమని భావించనంత వరకు అతని శుభము, నీడ మానవునిపై పడదు. ఇలా

జరిగినచో గొప్ప ఆనందము కలుగును.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. నమాజ్‌ను ఎందుకు రక్షించుకోవాలి. నమాజ్ ఎందుకు చదవాలి. అల్లాహ్ తఆలాకు మన నమాజులు అవసరమా? చాలా మందికి ఇటువంటి ప్రశ్నలు కలుగును. ఇవి నాస్తిక ప్రభావము వలన కలుగును. ఈ విషయమును వివరించుచు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. దేవునికి మన నమాజుల అవసరం ఏమాత్రం లేదు. అతనికి ఎవరి అసవరం లేదు. మానవునికే అవసరము. ఒక రహస్యమేమనగా మానవుడు తన మేలును కోరును. అందుకే అతడు దేవునితో సహాయము ఆశించును. దేవునితో మానవునికి సంబంధము ఏర్పడుట నిజమైన శుభమని అతనికి తెలుసు. ఇటువంటి వ్యక్తికి ప్రపంచమంతయు శత్రువైనా, అతన్ని నాశనము చేయదలచినా అతన్ని ఏమియును చేయలేదు. ఇటువంటి వ్యక్తి కొరకు లక్షలు, కోట్ల మందిని అల్లాహ్ తఆలా నాశనము చేయవలసి వచ్చినను చేయును. ఆ ఒక్కని కొరకు లక్షలాది మందిని హతమార్చును.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. మీరు మీ నమాజులను ఆనందమయముగా చేయదలచినచో తమ భాషలో కొన్ని దుఆలు చేయగలరు. కాని నమాజులు ఆసనాలు చేసినట్లే చేయుదురని గమనించనైనది. నమాజ్ తరువాత దుఆ చేస్తారు. తద్వారా నమాజ్ ఒక అనవసర ట్యాక్స్‌గా కనిపించును. పెద్ద పెద్ద కార్యముల తాళంచెవి దుఆ మాత్రమే. దేవుని శుభముల ద్వారము తెరుకొను మొదటి దశ ఇదే.

దేవునికి ఇందులో ఎలాంటి లాభము లేదు. మానవునికే లాభము గలదు. అతనికి దేవుని ఆస్థానములో అవకాశము లభించును. కొన్ని విన్నపములు చేయు అవకాశము లభించును. అనేక కష్టముల నుండి విముక్తి లభించును. తమకు ఒక దేవుడున్నాడని తెలియకుండానే రాత్రింబవళ్లు తమ జీవితము గడుపుచున్న వారి గురించి నేను ఆశ్చర్యపడుచున్నాను. ఇటువంటి మానవుడు నేడైనా లేదా రేపైనా నాశనమగునని గుర్తుంచుకోగలరు. ప్రజలు గుర్తుంచుకుంటారనే నమ్మకముతో నేనొక ఉపదేశము చేయుచున్నాను. వయసు గడుచుచున్నది. నిర్లక్ష్యమును వీడుము. భక్తి శ్రద్ధల స్థితిని కలిగించుకొనుము. ఒంటరిగా దేవునితో దుఆ చేయగలరు. దేవుడు విశ్వాసమును రక్షించుగాక! అతడు మీతో రాజీ పడుగాక! మరో సందర్భమున ఉపదేశించుచు వారిట్లు తెలిపిరి. ఇప్పటికి అతని కరుణ ద్వారము మూయబడలేదు. నిర్మలమైన హృదయును కల్పించుకొనుము. నమాజులను శ్రద్ధతో చదువుము. దుఆలు చేయుచుండుము. మా బోధనను పాటించుచుండుము. మేము కూడ దుఆ చేయుదుము.

మనమందరము నిజమైన రీతిలో ఏకేశ్వరవాదమును స్థాపించువారమగుదుము గాక! తమ నమాజులను రక్షించు వారమగుదుము గాక! ఆనందముతో కూడిన నమాజులు చేయువారమగుదుము గాక! దైవేతరులను ఆరాధకులుగా చేసే బదులు మనము సదా అల్లాహ్ తఆలాను నిజమైన ఆరాధకునిగా చేసుకొనువారమగుదుము గాక!)ఆమీన్)

☆☆☆

(Summary: Office Nashr-o-Isha'at, Translation: Hafiz Syed Rasool Niyaz, Telugu Desk)

BOOK POST (PRINTED MATTER)

To,

....

....

....